# అత్తా కోడలీయం ఆనాటిదే



*అంబా తుష్యతి నమయానతయా*
*సాపి నమయా నాంబయా*
*అహమపినతయా నతయా*
*వదరాజన్ కస్య దోషోయం*

ఈనాడు ఉమ్మడి కుటుంబాల గొప్పతనాన్ని గురించి చాలామందే అస్తమానం చెప్తున్నారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఉమ్మడి కుటుంబాలు లేకపోవడమే కారణమంటున్నారు. చివరకు కాలేజీల్లో

రాగింగ్ జరగడానికి కూడా ఇంట్లో నీతులు చెప్పే తాతలూ, బామ్మలూ లేకపోవడమేనని విశ్లేషిస్తున్నారు. ఒత్తిడి నివారణకూ, మనశ్శాంతికీ పరిష్కారం అంతా కలసి ఉండడమేనన్న నమ్మకమొకటి బలంగా వ్యాపింపచేసే ప్రయత్నం జరుగుతోంది. ఉమ్మడి కుటుంబాలలో జీవితమెలా ఉండేదన్నది ఈ తరం తెలుసుకోవాలనుంటే బాగా వయస్సయిన స్త్రీలను ప్రశ్నించాలి. వారిలో చాలామంది తమ అత్తగార్లు తమని ఉమ్మడి కుటుంబాలలో ఎలా కాల్చుకుని తినేవారో ఆడపడుచులు ఎలా ఆరడిపెట్టేవారో చెప్తారు. ఇప్పుడు తమ కోడళ్ళు తమనెంత నిర్లక్ష్యం చేస్తున్నారో కూడా చెప్తారు. ఏ తరం వారిని అడిగినా జవాబులో పెద్దగా తేడా ఉండదు.

'అత్త లేని కోడలు ఉత్తమురాలు, కోడలులేని అత్త గుణవంతురాలు' అన్న సామెత ఊరికేనే పుట్టలేదు. అయితే ఇక్కడ సమాజవిశ్లేషకులూ, మనసత్వ శాస్త్రవేత్తలూ ఈ పరిస్థితికి పారిశ్రామికీకరణా, పట్టణాలకు వలసా కారణమని చెప్పవచ్చు. ఆమాట నిజమేనా? రెండువేల ఏళ్ళనాటి పరిస్థితులేమిటి?

రాజసింహుని చిన్ననాడే తండ్రి రాజుగారి సైన్యంలో పనిచేస్తూ యుద్ధంలో మరణించాడు. తల్లి అతన్ని పెంచి పెద్దచేసింది. మహారాజు అతనికి విద్యాభ్యాసం చేయించి ఉద్యోగమిచ్చాడు. రాజసింహుడికి వివాహమైంది. అంతవరకూ కథ బాగానే నడిచింది.

భార్య వివాహమై కాపురానికి వచ్చినప్పటినుంచీ కష్టాలు మొదలయ్యాయి. భార్యతో వచ్చిన అరణపుదాసి ప్రవర్తన అతని తల్లికి నచ్చలేదు. ఇంట్లోని వంటావిడ తనని సంప్రదించకపోవడం భార్యకు నచ్చలేదు. రాజసింహుడు భార్యతో ఎక్కువ సమయం గడపడం తల్లికి నచ్చలేదు. జీతం తల్లికివ్వడం భార్యకు నచ్చలేదు. ఇంట్లో గొడవలు ఎక్కువై గృహంలో శాంతీ, రాజసింహుడికి మనశ్శాంతీ కరువై రాజకార్యాలలో తప్పులు రాసాగాయి. ప్రశ్నించిన మహారాజుతో అతను విషయం చెప్పుకున్నాడు.

" అమ్మకి నావల్లా, ఆమెవల్లా ఆనందం లేదు. ఆమెకు నావల్లా, అమ్మవల్లా సుఖంలేదు. నాకిద్దరి వల్లా సంతోషం లేదు. ఇది ఎవరి తప్పో చెప్పండి" ఆధునిక మనస్తత్వ శాస్త్రవేత్తలు పాతికేళ్ళుగా పెంచిన కొడుకు దూరమౌతున్నాడన్న అభద్రతాభావంవల్ల అత్తలిలా ప్రవర్తిస్తారనీ, కోడళ్ళే సర్దుకుపోవాలనీ అంటారు. కన్న తల్లితండ్రులనీ, పుట్టి పెరిగిన వాతావరణాన్నీ వదిలి వచ్చిన కోడలికెంత అభద్రతాభావం ఉండాలి? ఇప్పటి ప్రశ్న రెండువేల ఏళ్ళక్రింద కూడా ఉందంటే సమాజ స్థితిగతుల్లో మార్పు రానట్లేకదా.

" వదరాజన్ కస్య దోషోయం."

తప్పు ఎవరిదో చెప్పండి. ప్రతి ఒక్కరూ ఆలోచించవలసిన విషయమిది.

******